# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అస్సాంలో జరిగే హిమంత బిశ్వశర్మ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు.**

2. **దేశానికి ఆదర్శంగా తెలంగాణలో విద్యా రంగాన్ని తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష– ఏపీఈఏపీసెట్ 2026 పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి**

5. **అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అస్సాం రాష్ట్ర రాజధాని గువహటికి చేరుకున్నారు. ఈ ఉదయం పది గంటలకు గువహటిలో జరగనున్న హిమంత బిశ్వశర్మ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రముఖ రాజకీయ నాయకులు హాజరుకానున్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు తిరిగి అమరావతికి చేరుకోనున్నారని అధికారులు తెలిపారు.

------------------------

తెలంగాణ విద్యా రంగాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..25.. సెకన్లు

------------------------

కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిన్న ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుంటూరు--విజయవాడ జాతీయ రహదారిపై కాజా టోల్‌గేట్ సమీపంలోని పశ్చిమ బైపాస్ వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో సమావేశమై పల్నాడు జిల్లా అభివృద్ధికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. పిడుగురాళ్ల--శావల్యపురం నుంచి రామాయపట్నం పోర్టుకు రైల్వే లైన్ నిర్మించాలని, నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో వందేభారత్ రైలుకు హాల్ట్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు 2027 జూన్ నాటికి పూర్తవుతుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని బృందం నిన్న సమావేశమై పోలవరం ప్రాజెక్టు పురోగతిపై చర్చించింది. ఆ వివరాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారాల నిధులను సకాలంలో విడుదల చేయాలని కేంద్రాన్ని కోరామని రామానాయుడు వివరిస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే - ఏపీఈఏపీసెట్ 2026 పరీక్షలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ పరీక్షలు రెండు విడతలుగా ఈరోజు నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 48 పట్టణాల్లో 142 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండవ విడత పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు.

---------------------------

చేనేత రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు నేత కార్మికులకు సహకారం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి వారికి సంబంధించిన సమస్యలపై చర్చించారు. చేనేత సహకార సంఘాలకు కేటాయించిన నిధులను త్వరలో విడుదల చేస్తామని ఈ సందర్భంగా మంత్రి సవిత తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

సమాజంలో వైద్య సేవలకు ప్రతి రూపంగా నిలుస్తున్న, నర్సులు అందజేస్తున్న సేవలను స్మరించుకుంటూ ఈ రోజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. వైద్యసేవలకు తన జీవితాన్ని అంకితం చేసిన "ఫ్లోరెన్స్ నైటింగేల్" జయంతిని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ

ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. 1820వ సంవత్సరం మే 12వ తేదీన ఇటలీలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1854 సంవత్సరంలో సంభవించిన క్రిమియన్ యుద్ధంలో గాయపడిన సైనికులకు వైద్య సేవలు అందించారు. రాత్రి సమయాలలో కూడా గాయపడ్డ సైనికులకు నూనె దీపం సహాయంతో వైద్య సేవలు అందించడంతో ఆమెకు "లేడీ విత్ ల్యాంప్" అని పేరు వచ్చింది.

---------------------------

నర్సింగ్ రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఐదుగురికి 2025 సంవత్సరానికి గానూ 'ఫ్లోరెన్స్ నైటింగేల్' పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఈరోజు గుంటూరులో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. నెల్లూరుకి చెందిన బి. వనజ కుమారి, విజయనగరానికి చెందిన సి.ఆర్. సంషేర్ , మచిలీపట్నానికి చెందిన కె. సుగంతి, శ్రీకాకుళం జిల్లా కు చెందిన ఎస్. చిన్నమ్మి, అనంతపురం జిల్లాకు చెందిన కె. సావిత్రిలను పరిశోధన, బోధన, రోగుల సేవలు వంటి విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని లోక్ భవన్‌లో నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే ప్రత్యేక సభకు హాజరు కావాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సామూహిక ప్రతిజ్ఞ చేయించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించాలని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా గతంలో సూచించారు. గవర్నర్ సూచన మేరకు సభ నిర్వహించి విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో, ఉత్తర శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం అదే ప్రాంతంలో కొనసాగుతోందని అమరావతి ఆంధ్రప్రదేశ్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వర్ష సూచన ఉన్నప్పటికీ, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వడగాలుల ప్రభావం కూడా ఉంటుందని తెలిపింది.

=====================